క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో వనమహోత్సవం

పెంచికల్‌పేట్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎంపీడీవో అల్బర్ట్, ఎస్సై అనిల్ కుమార్‌లు శుక్రవారం మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ప్రముఖపాత్ర వహిస్తాయన్నారు. నాటిన ప్రతీ ఒక్క మొక్కను రక్షించడానికి బాధ్యతగా కృషి చేయాలన్నారు. ఏపీవో సతీశ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

వాంకిడి: మండలంలోని కనర్‌గాం గ్రామానికి చెందిన ఆనంద్‌రావు, ఆసిఫాబాద్‌కు చెందిన చిన్ను ఇటీవల వారి సెల్ ఫోన్లను పోగొట్టుకోగా వాంకిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించారు. సెల్‌ఫోన్లను ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీమ్‌ను ఎస్సై అభినందించారు.

'గుండి రహదారికి మరమ్మతు చేయండి'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రం నుంచి గుండి, జాతీయ రహదారికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మానవహక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ కోరారు. శుక్రవారం గుండి రహదారికి మరమ్మతులు చేయించి వాహనదారుల సమస్య పరిష్కరించాలని మానవహక్కుల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో గుండి రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. వెంటనే స్పందించి గుండి రహదారిని బాగు చేయాలని కోరారు. ఆయన వెంట కమిటీ సభ్యులున్నారు.

సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో విద్యార్థులు, మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని భరోసా టీం ఎస్సై తిరుమల సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్యవివాహాలు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్స్ వంటి వాటిపై షీటీం సభ్యులు స్వప్న, రజని, దినేశ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరోసా టీం ఎస్సై తిరుమల మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వీడియోలు, ఫొటోలను పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, పిల్లలు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రిన్సిపాల్ అరుణశ్రీ, అధ్యాపకులు, షీటీం సిబ్బంది జీవిత, ఏఎస్ఎం విజయ, తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పట్టణ పద్మశాలీ మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆషాఢ గోరింటాకు వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పరస్పరం చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. గోరింటాకు ప్రాముఖ్యతను వివరించారు. పట్టణ అధ్యక్షురాలు జంజిరాల పుష్పలత, కార్యదర్శి చెన్నూరి సునీత, కోశాధికారి అనుమాండ్ల కాంత్రికుమారి, వనమాల, జయ, ఇరుకుల్ల పుష్పలత, సుజాత, లహ రి, రోషిని, శోభ, రక్షిత, ఉమ, రజని, రమ, అనసూ య, విజయ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు జరుపుకొన్నారు. మహిళలు పరస్పరం చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. క్లబ్ ప్రతినిధి ఎకిరాల శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు పాత శ్రీనివాస్, ముక్క కృష్ణమూర్తి, కోశాధికారి కట్కూరి కిశోర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్, ఆర్య వైశ్య మహిళలు పాల్గొన్నారు.

బుద్ధుని శాంతి మార్గమే శరణ్యం

వాంకిడి: గౌతమ బుద్ధుడు చూపిన శాంతి మార్గమే శరణ్యమని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ పరంధాములు పేర్కొన్నారు. వర్షవాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి మండల కేంద్రంలోని ప్రహ్లాద్ ముండె ఫంక్షన్ హాల్‌లో అభ్యుదయ ఆర్ట్ అకాడమి, హైదరాబాద్ వారితో నిర్వహించిన 'బుద్ధునితో నా ప్రయాణం' నాటికను బీఎస్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నల్ల సూర్యప్రకాశ్‌తో కలిసి ప్రారంభించారు. బీఎస్ఐ రాష్ట్ర నాయకులు బాలాజీ గాయక్‌వాడ్, డాక్టర్ సునీల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండలాధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి విజేయ్ ఉప్రె, అంబేడ్కర్ యువజన సంఘం, రమాబాయి మహిళా మండలి, సిద్ధార్థ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

మూలమలుపు.. మృత్యుపిలుపు



పెంచికల్‌పేట్ –లోడుపల్లి ప్రధాన రహదారిలోని లోడుపల్లి వంతెన మూలమలుపు వద్ద చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్లతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడని పరిస్థితి ఉంది. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు పొదలు, చెట్లు తొలగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. – పెంచికల్‌పేట్

జనావాసాల్లో మురుగునీరు

పెంచికల్‌పేట్ మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు జనావాసాల మధ్య వర్షపు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. వర్షపు నీరు దోమలకు ఆవాసంగా మారి పారిశుధ్యం లోపించి రోగాలు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. – పెంచికల్‌పేట్



చెరువును తలపిస్తూ..



పెంచికల్‌పేట్ –సలుగుపల్లి ప్రధాన రహదారిపైన పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో వర్షపు నీరు చేరడంతో రహదారి చెరువును తలపిస్తోంది. వర్షపు నీరు గుంతల్లో చేరడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – పెంచికల్‌పేట్

యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై

దహెగాం: యువత చెడు వ్యసనాలు వీడి క్రీడల్లో రాణించాలని ఎస్సై విక్రమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచవెల్లి యువతకు పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో వాలీబాల్ కిట్టు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలగడంతో పాటు శరీర ధారుడ్యం పెరుగుతుందన్నారు. స్నేహ సంబంధాలు మెరుగు పడతాయన్నారు. సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులూ.. జరభద్రం

- వ్యాధుల కాలం.. అప్రమత్తత తథ్యం
- ఇళ్లు, పరిసరాల శుభ్రత తప్పనిసరి
- పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యం



చేతులు శుభ్రం చేసుకుంటున్న ధనోరా పాఠశాల విద్యార్థులు

కెరమెరి: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే తరగతి గదిలో ఏకాగ్రతతో చదవగలుగుతారు. ప్రస్తుతం రోజూ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే కొన్నికొన్ని పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యంతో గైర్హాజరవుతున్నారు. రానున్న కాలంలో గైర్హాజరు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో క్రమం తప్పకుండా బడికి హాజరు కావాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆహారపరమైన జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. వర్షాకాలం దృష్ట్యా కాలానుగుణంగా వ్యాధులు విజృంభిస్తాయి. పెద్దల కంటే పిల్లలపై వీటి ప్రభావం అధికంగా ఉంటుంది. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరకుండా చూడవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

పరిశుభ్రత లోపిస్తే..

వర్షాకాలంలో పరిశుభ్రత పాటించకుంటే వ్యాధుల బారిన పడే అవకాశం అధికంగా ఉంటుంది. అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు దగ్గు, జ్వరం, ఫ్లూ, సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశముంటుంది. ఈ కారణంగా పాఠశాలలకు తరచుగా గైర్హాజరయ్యే అవకాశం మెండుగా ఉంటుంది. స్వచ్ఛమైన నీరు తాగకుంటే విరోచనాల బారిన పడే ప్రమాదముంది. పిల్లలకు సకాలంలో టీకాలు ఇవ్వకుంటే రోగ నిరోధక శక్తి తగ్గి వ్యాధులు అధికమయ్యే ఛాన్స్ ఉంది. రోజూ స్నానం చేసి ఉతికిన బట్టలు ధరించాలి. చేతులు శుభ్రంగా కడుక్కుంటే గజ్జి, తామర సోకదు. ఆరు మాసాలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఉతికిన బట్టలు వేసుకుంటూ రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలి.

స్వీయ జాగ్రత్తలు అవసరం



వాతావరణంలో మార్పులతో పిల్లలు అస్వస్థతకు గురయ్యే అవకాశముంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. పౌష్టికాహారం తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. బయటి ఫుడ్‌కు దూరంగా ఉండాలి.

– రియాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, కెరమెరి

అవగాహన కల్పిస్తున్నాం



మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీరోజు శుచి, శుభ్రత గురించి వివరిస్తున్నాం. ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రత పాటిస్తున్నాం. ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేస్తున్నాం.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

గోరువెచ్చని నీటిని తాగాలి. ఇల్లు, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. తాజా పళ్లు తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. రోజూ డ్రైఫ్రూట్స్, ఉడకబెట్టిన కోడిగుడ్లు తినాలి. పాలు, తాగాలి. తొందరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. వీలైనంత ఎక్కువగా ఆకుకూరలు తినాలి.

'పెంచికల్‌పేట్ పేరును కొనసాగించాలి'



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ ఎంపీటీసీ స్థానానికి పెంచికల్‌పేట్ పేరునే కొనసాగించాలని కోరుతూ గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం హైదరాబాద్‌లోని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి డిప్యూటీ కమిషనర్, ఎన్నికల డిప్యూటీ కమిషనర్లకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పునఃర్విభజనలో భాగంగా ఎల్లూర్, పెంచికల్‌పేట్ పంచాయితీలను కలిపి ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయగా అధికారులు పెంచికల్‌పేట్ పేరు తొలగించి ఎల్లూర్ ఎంపీటీసీగా మార్చారన్నారు. పెంచికల్‌పేట్‌గా మార్పు చేయకుంటే స్థానికసంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో యువకులు రహీమ్, అనిఫ్, తిరుపతి, భీమేశ్, సాయి, హరీశ్, రామన్న ఉన్నారు.

బురదమయంగా 'రాజీవ్ నగర్' రోడ్డు



ఇసుకతో రోడ్డుపై గుంతలు పూడుస్తున్న గ్రామస్తులు

వాంకిడి: మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అడుగడుగునా గుంతలు ఏర్పడి రోడ్డంతా చిత్తడిగా మారుతోంది. ద్విచక్ర వాహనాలతోపాటు ఎలాంటి వాహనాలూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ రహదారి పరిస్థితి మారడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సరైన రోడ్డు లేక వర్షాకాలం విద్య, వైద్యం అందడం గగనంలా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గ్రామస్తులంతా కలిసి బురద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇసుకతో గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి యెలగతి సుచిత్ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా దృష్టి సారించి ఆదివాసీ గ్రామాల రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

ఫీజులు నియంత్రించాలి

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలో విచ్చలవిడిగా ఫీజుల వసూలుకు పాల్పడుతున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈవో ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలపై నియంత్రణ చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కొట్రంగి కార్తీక్, నాయకులు దేవిశ్రీ ప్రసాద్, మహేశ్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహణ అధికారి శ్రీనివాస్ రూ.8 లక్షల విలువైన చెక్కు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతుల కారణంగా పట్టణంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు.

బీసీలకు 42శాతం కోటా హర్షనీయం

దహెగాం: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం కోటా రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం హర్షనీయమని మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణసంచాలు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడుతుందన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ భీమన్న, నాయకులు అంజన్న, తోగయ్య, పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రెబ్బెన: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీసీలకు రాజకీయాల్లో సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లావుడే రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్స్‌లో శనివారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌యాదవ్, నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

దళారుల ప్రమేయం ఉండొద్దు

బెజ్జూర్: దళారుల ప్రమేయం లేకుండా అసలైన రైతులకే యూరియా పంపిణీ జరిగే విధంగా చూడాలని ఏవో నాగరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సబ్సిడీపై యూరియా పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటివరకు 1300 యూ రియా బస్తాలు రైతులకు అందించినట్లు తెలి పారు. రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు. సీఈ సత్యనారాయణ గౌడ్, ఏ ఈవోలు మీనా, మారుతి తదితరులు ఉన్నారు.

నిరుపేద చికిత్సకు సాయం

బెజ్జూర్: మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన కొర్తే తిరుపతి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1లక్ష 10వేలు మంజూరయ్యాయి. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతికి దీనికి సంబంధించిన ఎల్‌వోసీని ఎమ్మెల్యే హరీశ్‌బాబు పీఏ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అందజేశారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

కౌటాల: హాస్టల్‌లో ని విద్యార్థులకు పౌ ష్టికాహా రం అందించాలని ఎంఈవోగా వుడే హన్మంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ని కేజీబీవీ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు అనారోగ్యం బారి నపడితే వెంటనే ఆస్పత్రికి తరలించాలని తెలి పారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తెలిపారు. ఎస్‌వో పవిత్ర ఉన్నారు.

పరిహారం అందించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: పెంచికల్‌పేట్ మండలంలో మేతకు వెళ్లి విషపు మొక్కలు తిని 157 గొర్రెలు మృతి చెందగా, మరో 200 అనారోగ్యం ఉన్నాయని, నష్టపోయిన బాధిత యజమానులకు పరిహారం అందించాలని గొర్రెలు, మేకల పెంపకం, సంక్షేమ వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, యాదవ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సురేశ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, మారుతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నూతన కార్యవర్గం

కెరమెరి: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్వగృహంలో శుక్రవారం కెరమెరి మండల బీఆర్ఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాథోడ్ అంబాజీ, ఉపాధ్యక్షులుగా కుర్సెంగ దుందేరావు, సెండె సకారాం, ప్రధాన కార్యదర్శిగా నిసార్ అహ్మద్ దేశ్‌ముఖ్, సంయుక్త కార్యదర్శులుగా గోగర్ల రాజయ్య, సిడాం భీంరావు, కోశాధికారిగా జాడి మధూకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్క నాటి నీరు పోస్తున్న శ్రీశ్రావణి

కాగజ్‌నగర్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని టీజీఎఫ్‌డీసీ డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ విద్యార్థులతో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మేనేజర్ శ్రీశ్రీవాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి, సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్, లక్ష్మణ్, జలపతి, వసతి గృహ సంక్షేమ అధికారి ఆర్.కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దహెగాం: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రాణహిత, పెద్దవాగులోకి వరద నీరు వస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మొట్లగూడ, రాంపూర్, రావులపల్లి, దిగిడ గ్రామాల్లో పర్యటించారు. ప్రాణహిత వరదల వల్ల నీట మునిగిన పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరద ప్రవాహం ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. పంట నష్టపోయిన వారి వివరాలు సేకరించాలని ఏవోకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు విజయ్, ప్రశాంత్‌లు ఉన్నారు.

పెంచికల్‌పేట్: ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. వరదతో నీట మునిగిన పంట చేలను పరిశీలించారు. పంచాయితీ కార్యదర్శులు రాకే శ్, గణేశ్, ప్రశాంత్, విజయ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని నిరుద్యోగులైన ట్రాన్స్‌జెండర్ల ఉపాధి పునరావాస పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్య శిక్షణలో భాగంగా డ్రైవింగ్, ఫొటో, వీడియోగ్రఫీ, బ్యూటీషియన్, జూట్‌బ్యాగ్ టైలరింగ్, లాజిస్టిక్ రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ట్రాన్స్‌జెండర్లు ఈ నెల 23లోగా https:// wdsc. telangana. gov. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040– 24559050 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం

ఆసిఫాబాద్‌అర్బన్: దివ్యాంగులు ఆర్థిక స్వావలంబనతో సాధారణ జీవనం సాగించేందుకు వీలుగా వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఉపాధి, పునరావాస పథకం అమలు చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ.50వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 16 యూనిట్ల ద్వారా రూ.8 లక్షల రాయితీ మంజూరైందని, లబ్ధిదారుల ఎంపిక ఆన్‌లైన్ ద్వారా జరుగుతుందన్నారు. కనీసం 40శాతం దివ్యాంగత్వం, 21– 25 ఏళ్లు, వార్షిక ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించి ఉండొద్దని, గత ఐదేళ్లలో ఈ పథకం కింద లబ్ధి పొందని వారు అర్హులని తెలిపారు. కుటుంబం యూనిట్ పరిగణిస్తారన్నారు. సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఇటీవల తీసుకున్న ఆదాయ, నివాస, వయస్సు ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతలు, పాస్ ఫొటోలు ఉండాలన్నారు. ఈ నెల 14 నుంచి 28వరకు https:// tgobmms. cgg. gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ గజానంద్ 4, 5, 9, 10 వార్డుల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాలనీ ప్రజలకు అవగాహన కల్పిస్తూ నిల్వ నీటిని తొలగించారు.

కాగజ్‌నగర్‌టౌన్: ఈ నెల 13న మహంకాళి బోనాల సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో గల మహంకాళి దేవాలయం సమీపంలోని నాలాలు, ఆలయ ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించి, కాలువలు శుభ్రం చేశారు. ఆలయం చుట్టూ బ్లీచింగ్ పౌడర్ వేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

కౌటాల: మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో శుక్రవారం భక్తులు పోచమ్మ బోనాలు జరుపుకున్నారు. బోనాలతో శివసత్తులు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం శివాలయం నుంచి పోచ మ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మకు బోనాలు సమర్పించి పూజలు చేశారు. మండలంలో విస్తారంగా వర్షాలుగా కురిసి పంటలు సంవృద్ధిగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేసినట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంబెద శంకరయ్య, సంతోష్, భక్తులు పాల్గొన్నారు.